

నత్తనడకన పనులు

ఎన్నో ఏళ్లుగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో.. కల నెరవేరుతుందన్న తరుణంలో.. ఎన్‌హెచ్‌–440 రోడ్డు పనులు నిరాశ కలిగిస్తున్నాయి.

– 8లో



సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకం

సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకమని పశ్చిమ రాయలసీమ టీచర్స్‌ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు.

– 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.8 /26.4

జిల్లాలో ఆదివారం 26.4 – 33.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్‌.

న్యూస్‌రీల్‌

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ఏపీఎస్‌ ఆర్టీసీ కడప డిపోలో డ్రైవర్లుగా పనిచేసేందుకు అర్హులైన వారినుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కడప డిపోలో డ్రైవర్ల కొరత కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. అభ్యర్థులు హెవీ లైసెన్స్‌ కలిగి 18 నెలల అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. అర్హులు తమ ఆధార్‌ , విద్యార్హత సర్టిఫికెట్‌ జిరాక్స్‌లతో పాటు ఆర్‌టీఓ క్లియర్స్‌ సర్టిఫికెట్‌ తమ కార్యాలయంలోని జిల్లా డ్రైవింగ్‌ ఇన్‌స్ట్రక్టర్‌ సుధా కృష్ణారెడ్డికి అందజేయాలని వివరించారు. ఇతర వివరాలకు 73828 64533 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

8 నుంచి ఆధార్‌ శిబిరాలు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : జాతీయ తపాలా వారోత్సవాల సందర్భంగా ఈ నెల 8 నుంచి 14 వరకు కడప డివిజన్‌ పరిధిలో మొబైల్‌ ఆధార్‌ శిబిరాలను నిర్వహించనున్నట్లు కడప డివిజన్‌ పోస్టల్‌ సూపరింటెండ్‌ రాజేష్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప డివిజన్‌ పరిధిలోని కడప పోస్టల్‌ ప్రధాన కార్యాలయం, శంకరాపురం పోస్టాఫీసు (మోర్‌ సూపర్‌ మార్కెట్‌ పక్కన) రాయచోటి, బద్వేలు ప్రాంతాల్లో శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ శిబిరాల్లో బయోమెట్రిక్‌ అప్‌డేట్‌, ఆధార్‌ నమోదు వంటి సేవలను అందిస్తామని పేర్కొన్నారు. సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు అవార్డుల ప్రదానం

కడప ఎడ్యుకేషన్‌ : స్వచ్ఛాంధ్ర 2025లో భాగంగా కడప నగరపాలక ఉన్నత పాఠశాల (మెయిన్‌) జిల్లాస్థాయి ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. ఆగస్టు 20 నుంచి సెప్టెంబర్‌ 27 వరకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో భాగంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర – 2025 వివిధ విభాగాల్లో నిర్వహించిన సర్వేలో పాఠశాల స్థాయి విభాగంలో జిల్లా నుంచి ఐదు పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇందులో వేపరాల జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల, హిమకుంట జెడ్పీ హైస్కూల్‌, కస్తూరి బాలిక విద్యాలయం(దువ్వూరు), కడప నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్‌, రామేశ్వరం మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాలలు ఎంపికయ్యాయి. సోమవారం కడప కలెక్టరేట్‌ సభా భవనంలో జరిగే కార్యక్రమంలో ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు కలెక్టర్‌ అవార్డులను అందచేసి సత్కరించనున్నారు.

12న జిల్లాస్థాయి వ్యాసరచన పోటీ



మాట్లాడుతున్న వసుమనా వెంకటేష్‌దాస్‌

ప్రొద్దుటూరు కల్చరల్‌ : అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం (ఇస్కాన్‌) ఆధ్వర్యంలో ఈ నెల 12న సాయంత్రం 4గంటలకు స్థానిక ఇస్కాన్‌ కేంద్రంలో విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు ఇస్కాన్‌ ప్రతినిధులు వసుమనా వెంకటేష్‌దాస్‌ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల్లో పోటీతత్వం, నైతిక విలువలు, ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఇస్కాన్‌, దామోదర లీల అనే అంశాలపై వ్యాసరచన పోటీలు ఉంటాయని, ఇంటర్‌, డిగ్రీ, బీటెక్‌, డిప్లమో, ఎంబీఏ, ఫార్మసీ విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈ నెల 21న దీపావళి పండుగ రోజున పోటీల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.50,000లు. ద్వితీయ బహుమతిగా రూ.25,000, తృతీయ బహుమతిగా రూ.10వేలతో పాటు 20 ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 95428 63866 నంబర్లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో ఇస్కాన్‌ ప్రతినిధులు యశ్వంత్‌, వైకుంఠ ఈశ్వర్‌దాస్‌ పాల్గొన్నారు.

గంగమ్మకు బోనాల సమర్పణ



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన అనంతపురం గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బోనాలు సమర్పించి, తలనీలాలు అర్పించారు. తల్లీ ..కాపాడమ్మా అంటూ వేడుకున్నారు. పూజారులు చెల్లు వంశీయులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎందుకింత నిర్లక్ష్యం!

- జిల్లా గోడౌన్‌లో అరకొరగా రేషన్‌ బియ్యం నిల్వలు!
- రెండు నెలలకు సరిపడా స్టాకు బఫర్‌ గోడౌన్‌లో ఉండాలని నిబంధనలు
- జిల్లాలో 7వేల టన్నులకు మాత్రమే పరిమితం చేసిన అధికారులు
- మరో 12 వేల టన్నులు నిల్వ చేసే అవకాశం ఉన్నా విస్మరిస్తున్న వైనం
- గోడౌన్ల నిర్వహణలోనూ అశ్రద్ధే!



సాక్షి ప్రతినిధి, కడప : అసలే కూటమి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థపై చిన్నచూపు చూస్తోంది. ఆపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల్లో అవినీతి, అశ్రద్ధ రాజ్యమేలుతోంది. ఫలితంగా రేషన్‌ బియ్యం స్టాకులో నిబంధన పూర్తిగా పక్కదారి పట్టింది. రెండు నెలలకు సరిపడా రేషన్‌ బియ్యం నిల్వ చేయాలని నిబంధనలు ఉన్నా, అరకొర నిల్వలే ఉంటున్నాయి. బఫర్‌ స్టాకు నిల్వకు అందుబాటులో గౌడౌన్లు ఉన్నా, వినియోగించుకోని దుస్థితిలో అధికారగణం ఉంది.

వైఎస్సార్‌ కడప జిల్లాలో గతంలో 37వేల టన్నుల రేషన్‌ బియ్యం బఫర్‌ గోడౌన్లలో నిల్వ ఉండేవి. అప్పట్లో ప్రతి నెలా 12,800 టన్నులు ప్రజాపంపిణీకి సరఫరా చేసేవారు. జిల్లాల విభజన తర్వాత ప్రతి నెలా 9,500 టన్నులు అవసరం కానున్నాయి. ఆ మేరకు రేషన్‌షాపుల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారు. కాగా, నిబంధనలు ప్రకారం రెండు నెలలు రేషన్‌ బియ్యం నిల్వ చేయాల్సి ఉంది. కాగా, జిల్లాలో తాజాగా స్టేట్‌ వేర్‌ హౌస్‌ కార్పొరేషన్‌ గోడౌన్‌లో 7వేల టన్నులు మాత్రమే స్టాకు ఉన్నట్లు అధికారికంగా రికార్డులు వెల్లడిస్తున్నాయి. మరో 12వేల టన్నులు నిల్వ చేయాల్సి ఉండగా అధికారులు విస్మరిస్తున్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. అనుకొని విపత్తులు సంభవిస్తే సకాలంలో రేషన్‌ బియ్యం కూడా సరఫరా చేయలేని దుస్థితి దాపురించే అవకాశం లేకపోలేదని పలువురు వాపోతున్నారు.

గోడౌన్ల నిర్వహణ సక్రమంగా లేదని నివేదిక

రేషన్‌ బియ్యం నిల్వలు నేపథ్యంలో ఎస్‌డబ్ల్యూసీ బఫర్‌ గోడౌన్‌ను సివిల్‌ సప్లై, రెవెన్యూ అధికారులు ఉమ్మడిగా తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఎస్‌డబ్ల్యూసీ గోడౌన్‌ నిర్వహణ తీరు తెన్నులు పరిశీలించి, వేర్‌ హౌస్‌ మేనేజర్‌కు యాక్షన్‌ టేకన్‌ రిపోర్టు ఇచ్చారు. అందులో 14 రకాల అభ్యంతరాలను గుర్తించారు. ఫర్టిలైజర్‌ నిల్వకు యూజ్‌ చేసిన గోడౌన్లు కూడా ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. మెయింటెనెన్సు కూడా సక్రమంగా లేదని వివరిస్తూ ఈఏడాది జనవరి 21న నివేదిక ఇస్తూనే అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి యాక్షన్‌ చేపట్టాలని నివేదించారు. అయినప్పటికీ అదే గోడౌన్‌లో రేషన్‌ బియ్యం నిల్వలు కొనసాగిస్తుండడం, ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోకుండా వ్యవహరిస్తున్నారు.

ఎండీ ఉత్తర్వులు సైతం విస్మరించి...

సివిల్‌ సప్లయ్‌ ఎండీ సౌరభ్‌గౌర్‌ జిల్లాలో 22వేల టన్నులు రేషన్‌ బియ్యం నిల్వలు ఉండాలని ఆదేశించారు. ప్రజాపంపిణీ వ్యవస్థకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందస్తుగా జిల్లాలో నిల్వలు ఉండాలని నిర్ణయించారు. ఆ మేరకు జూలై 30న జాయింట్‌ కలెక్టర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా స్టేట్‌ వేర్‌ హౌస్‌ కార్పొరేషన్‌ గోడౌన్లలో 7వేల టన్నులు, సెంట్రల్‌ వేర్‌ హౌస్‌ కార్పొరేషన్‌ గోడౌన్లలో 5వేల టన్నులు, శ్రీసాయి గణేష్‌ గోడౌన్‌లో 10వేల టన్నులు నిల్వ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు జాయింట్‌ కలెక్టర్‌ అదితిసింగ్‌ సైతం సీడబ్ల్యూసీ గోడౌన్లలో 5వేల టన్నులు, శ్రీసాయి గణేష్‌ గోడౌన్లలో 10వేలు టన్నులు నిల్వ చేసుకునేందుకు యోగ్యంగా ఉన్నాయని వివరిస్తూ ఎండీకి సైతం వివరించారు. కాగా, బఫర్‌ స్టాకు నిల్వ చేసేందుకు సివిల్‌ సప్లయ్‌ యంత్రాంగానికి మనసొప్పకపోవడంతో అరకొర స్టాకుతో సరిపెట్టాల్సి వస్తోందని పలువురు వివరిస్తున్నారు.

ఏకపక్షంగా హ్యాండింగ్‌ అండ్‌ ట్రాన్సుపోర్టు టెండర్లు

స్టేట్‌ వేర్‌హౌస్‌ కార్పొరేషన్‌ పరిధిలో హ్యాండింగ్‌ అండ్‌ ట్రాన్సుపోర్టు టెండర్లు సైతం ఏకపక్షంగా చేపట్టారు. టెండర్లలో 6మంది పాల్గొంటే 5 టెండర్లు డిస్క్వాలిఫై అయ్యాయి. ఒక్క టెండర్‌తో మాత్రమే కొనసాగించారు. అనంతపురానికి చెందిన సంజీవరాయుడుకు 11శాతం అధికంగా టెండర్లు కట్టబెట్టడం గమనార్హం. సింగిల్‌ టెండర్‌ రద్దు చేయాల్సి ఉండగా ఎక్సెస్‌ రేట్లకు అప్పగించడం వెనుక కడప వేర్‌హౌస్‌ గోడౌన్‌ అధికారి ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. గ్రేడ్‌–1 మేనేజర్‌కు ఎస్‌డబ్ల్యూసీ ఆర్‌ఎంగా ఇన్‌ఛార్జి ఇవ్వాల్సి ఉండగా, గ్రేడ్‌–2 స్థాయి అధికారికి ఆర్‌ఎంగా బాధ్యతలు అప్పగించి టెండర్లు దక్కించుకున్నట్లు పలువురు చెప్పుకొస్తున్నారు. సదరు అ. ధికారికంటే 12మంది సీనియర్‌ అధికారులు ముందు వరుసలో ఉన్నారు. వారందర్నీ కాదని ఆ పోస్టు అప్పగించడం వెనుక హ్యాండింగ్‌ అండ్‌ ట్రాన్సుపోర్టు టెండర్లు ఏకపక్షంగా దక్కించుకునేందుకు వేసిన ఎత్తుగడలుగా పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం!

- రాత్రి సమయంలో జేసీబీలతో స్థలం చదును చేసిన టీడీపీ నాయకులు
- అడ్డుకున్న గ్రామస్తులు



వీరపల్లి సమీపంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు చదును చేసిన దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్‌ : బద్వేలు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఖాళీ ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే చాలు టీడీపీ నేతలు కబ్జాకు తెగబడుతున్నారు. ప్రభుత్వ స్థలాలు, చెరువు పోరంబోకు స్థలాలను ఎంచక్కా చదును చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు నాటుతున్నా లెక్కచేయకుండా బరితెగిస్తున్నారు.

ప్రభుత్వ స్థలంపై టీడీపీ నేతల కన్ను

మండల పరిధిలోని తిప్పనపల్లె గ్రామ పొలం వీరప్పల్లి సమీపంలో లంకమలకు వెళ్లే దారిలో సర్వే నెంబర్‌ 364, 381, 382, 383 తదితర సర్వే నెంబర్లలో సుమారు 13 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలం ఎలాగైనా కబ్జా చేయాలని మండల పరిధిలోని మల్లంపేట గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నేతలు రంగం సిద్ధం చేశారు. అనుకున్నదే తడవుగా శనివారం రాత్రి జేసీబీతో సదరు స్థలాన్ని చదును చేసి కబ్జాకు యత్నించారు. విషయం గ్రామస్తులకు తెలియడంతో మూకుమ్మడిగా వారంతా వచ్చి కబ్జాను అడ్డుకున్నారు. రాత్రి సమయంలో అక్కడి నుంచి వెనుదిరిగిన టీడీపీ నేతలు తిరిగి ఆదివారం ఉదయం సదరు ప్రభుత్వ స్థలంలో సిమెంటు స్తంభాలు నాటి హద్దులు ఏర్పాటు చేసుకున్నారు.

అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

తిప్పనపల్లె గ్రామపొలం వీరప్పల్లి సమీపంలో 13 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుందన్న విషయం తెలుసుకున్న బద్వేలు తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు రెవెన్యూ సిబ్బందిని పంపి సిమెంటు స్తంభాలు తొలగించి సదరు స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

టీడీపీ నేత అండదండలతోనే కబ్జా

ప్రభుత్వ భూమి కబ్జా వ్యవహారంలో టీడీపీ ముఖ్యనేత అండదండలున్నాయని సీపీఐఎంఎల్‌ లిబరేషన్‌ జిల్లా స్టాండింగ్‌ కమిటీ సభ్యులు ఎస్‌. చంద్రశేఖర్‌ ఆరోపించారు. ఆదివారం కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని సీపీఐఎంఎల్‌ లిబరేషన్‌ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.



కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న సీపీఐఎంఎల్‌ లిబరేషన్‌ బృందం

కొత్త టీచర్లు అంకితభావంతో పని చేయాలి



కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులతో కడప డీఈఓ షంషుద్దీన్‌

మదనపల్లె సిటీ : కొత్త టీచర్లు అంకితభావంతో పని చేయాలని కడప డీఈఓ డాక్టర్‌ షంషుద్దీన్‌ అన్నారు. ఆదివారం స్థానిక చిత్తూరు రోడ్డులోని గ్రీన్‌వ్యాలీ స్కూల్‌లో నూతనంగా ఎంపికైన టీచర్ల శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్లాస్‌రూములు సందర్శించి తనదైనశైలిలో కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులు పాఠశాలలో నిర్వర్తించాల్సిన విధుల గురించి, వ్యాయామ ఉపాధ్యాయుల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి రాజేశ్వర్‌రెడ్డి, రిసోర్సుపర్సన్లు రెడ్డిశేఖర్‌, శివశంకర్‌రెడ్డి, నరేంద్ర, నాగరాజరెడ్డి, కోర్సు డైరెక్టర్లు పాల్గొన్నారు.

కాల్‌ సెంటర్‌ సేవలను వినియోగించుకోండి

డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప సెవెన్‌రోడ్స్‌ : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రారంభించిన మీ కోసం కాల్‌ సెంటర్‌ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు తమ అర్జీలు, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్‌ చేయవచ్చని వివరించారు.

పాత పీజీఆర్‌ఎస్‌లో నిర్వహణ

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్‌)ను ఈ సోమవారం పాత పీజీఆర్‌ఎస్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలు నమోదు చేసుకోవడానికి 'మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్‌'వెబ్‌సైట్‌లో తమ అర్జీలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

డయల్‌ యువర్‌ కలెక్టర్‌ కార్యక్రమం

డయల్‌ యువర్‌ కలెక్టర్‌ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుంచి 10.00 గంటల వరకు జరుగుతుందని డీఆర్వో తెలిపారు. ప్రజలు 08562–244437 ల్యాండ్‌ లైన్‌ నెంబరుకు ఫోన్‌ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చని తెలిపారు.

నకిలీ మద్యం.. టీడీపీదే పాపం

- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- పాల వ్యాన్‌ ముసుగులో సరుకు సరఫరా
- ఎక్సైజ్‌ అధికారుల సెర్చ్‌ ఆపరేషన్‌



నకిలీమద్యం బాటిళ్లు, లేబుళ్లు, మూతలు

సాక్షి రాయచోటి/మదనపల్లె : నకిలీ మద్యం తీగ లాగితే అక్రమాల డొంక కదిలింది. ఒకచోట తయారు చేసి అనేక ప్రాంతాలకు విచ్చలవిడిగా సరఫరా చేయడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చుకుని అమ్ముకునే వ్యాపారులు కొందరైతే.... స్థానికంగా పేరొందిన టీడీపీ నాయకులే నకిలీ మద్యం తయారీని చేపట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. దాదాపు మూడు నాలుగు నెలల నుంచి ఈ తతంగం నడుస్తున్న క్రమంలో ఒక్క అన్నమయ్య జిల్లాలోనే కాకుండా సరిహద్దు ప్రాంతంలోని అటు అనంతపురం, ఇటు చిత్తూరు జిల్లాకు కూడా సరఫరా చేశారా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. మూడు రోజుల కిందట నకిలీ మద్యం తయారీకి సంబంధించిన యంత్రాలతోపాటు పెద్ద ఎత్తున డంపును స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం పెద్దతిప్ప సముద్రం మండలంలో నకిలీ మద్యం స్వా. దీనంతోపాటు ఒక వైన్‌షాపును కూడా సీజ్‌ చేయడం కలకలం రేపుతోంది. ములకలచెరువు సమీప ప్రాంతంలో నకిలీ మద్యాన్ని తయారు చేసిన అనంతరం నేరుగా బెల్ట్‌షాపులకు సరుకు రవాణా సాగింది. అయితే , ఇక్కడి నుంచి సరఫరాకు పాల వ్యాన్‌ తరహాలో ఆటో ద్వారా తతంగాన్ని నడిపినట్లు తెలియవచ్చింది. ములకలచెరువులో ఇటీవల ఎక్సైజ్‌ అధికారులు దాడులు చేసి పట్టుకున్న నకిలీ మద్యం వ్యవహారంలో కీలక అంశాలు లభ్యమయ్యాయి. అందుకు సంబంధించి అక్కడ దొరికిన డైరీ (చిన్న పుస్తకం)లో నకిలీ మద్యం తయారీ కేంద్రం నుంచి బెల్ట్‌ షాపులకు సరఫరా అయిన వివరాలు లభించాయి.

సెర్చ్‌ ఆపరేషన్‌

అన్నమయ్య జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎక్సైజ్‌ అధికారులు సెర్చ్‌ ఆపరేషన్‌ కొనసాగించారు. నిందితుల నుంచి వచ్చిన సమాచారంతోపాటు స్థానికుల ద్వారా అందుకున్న రహస్య సమాచారం మేరకు నియోజకవర్గంలో విస్తృతంగా దాడులు చేశారు. ప్రధానంగా పెద్ద తిప్పసముద్రం, పెద్దమండ్యం, బి.కొత్తకోట, తంబళ్లపల్లెతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ, తోటల్లోనూ ఆపరేషన్‌ నిర్వహించారు. పెద్దతిప్పసముద్రం మండలంలోని తోటలో నిల్వ చేసిన పలు రకాల నకిలీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్‌ సీఐ ఆధ్వర్యంలో ఒక్కో టీమ్‌ ఒక్కో మండలానికి వెళ్లి దాడులు నిర్వహించింది.

జిల్లాలో కలకలం

జిల్లాలో నకిలీ మద్యం వ్యవహారం కలకలం సృష్టిస్తోంది. ఎక్కడ చూసినా ఇదే వ్యవహారంపై చర్చ కొనసాగుతోంది. టీడీపీకి చెందిన సీనియర్‌ నాయకుడు సురేంద్రనాయుడుతోపాటు మరికొంతమంది కీలక టీడీపీ నేతల ప్రమేయంతో కుటీర పరిశ్రమగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. విజయవాడకు చెందిన వ్యక్తులతోపాటు స్థానికంగా టీడీపీలో పలుకుబడి కలిగిన నాయకులు ఇందులోకీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం రోజురోజుకు కొత్త మలుపులు తిరుగుతోంది. ఆదాయ మార్గాల కోసం టీడీపీ నాయకులు వక్రమార్గాలను ఎంచుకుని ప్రజల ప్రాణాలను లెక్కచేయకుండా అనేక చోట్లకు నకిలీ మద్యం సరఫరా చేసిన నేపథ్యంలో రానున్న కాలంలో ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురవుతాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

కుట్టు శిక్షణ.. కట్టుకథేనా!

ఉపాధి పేరుతో పేద మహిళలను ఊరించారు. శిక్షణ.. కుట్టు మిషన్లు.. అంటూ ప్రగల్భాలు పలికారు. ఆశపడి వేలాదిమంది మహిళలు ట్రైనింగ్‌ తీసుకున్నారు. శిక్షణ ముగిసింది.. 'మిషన్‌' ఇంకా బాకీ ఉంది. అవును.. మూడు నెలలు గడుస్తున్నా కుట్టు మిషన్లు..సర్టిఫికెట్ల మాటే లేకుండా పోయింది. కుట్టు శిక్షణ పేరిట..కట్టు కథ అల్లారని మహిళలు విమర్శిస్తున్నారు.

- జిల్లాలో 3210 మందికి ఉచిత శిక్షణ
- మూడు నెలలైనా అందని కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు
- సిబ్బందికీ అందని వేతనాలు
- బీసీ, ఈబీసీ, కాపు మహిళలకు రిక్తహస్తం
- ప్రగల్భాలకే పరిమితమైన కూటమి పాలకులు



కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు (ఫైల్‌)



కుట్టు శిక్షణలోని మెలకువలు తెలుసుకుంటున్న మహిళలు (ఫైల్‌)

కడప రూరల్‌ : బీసీ కార్పొరేషన్ల ద్వారా బీసీ, ఈబీసీ, కాపు వర్గానికి చెందిన పేద మహిళలకు ఉచిత కుట్టుమిషన్‌ శిక్షణ పేరిట కూటమి ప్రభుత్వం హడావుడి చేసింది. శిక్షణ అనంతరం కుట్టుమిషన్లు అందజేస్తామని ప్రగల్భాలు పలికింది. ఆచరణలోకి వచ్చే సరికి రిక్తహస్తం చూపిస్తోంది. కుట్టు మిషన్లు వస్తాయి...ఉపాధి పొందవచ్చని ఆశించిన మహిళలకు నిరాశే ఎదురైంది.

90 రోజులపాటు శిక్షణ

టైలరింగ్‌ శిక్షణకు సంబంధించి అర్హులైన వారు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఆ దరఖాస్తులు జిల్లా వ్యాప్తంగా ఉన్న మున్సిపల్‌ కమిషనర్లతోపాటు ఎంపీడీఓలకు పంపారు. నిబంధనల ప్రకారం నిరుపేదలై ఉండి 18 ఏళ్ల పూర్తయి 60 ఏళ్లలోపు గల వారిని ఈ శిక్షణకు ఎంపిక చేశారు. కాగా, టెండర్ల ద్వారా ఇద్దరు వ్యక్తులు ఈ శిక్షణ కార్యక్రమ బాధ్యతలను తీసుకున్నారు. వీరు సేప్‌ (సోషల్‌ ఏజెన్సీ ఫర్‌ పీపుల్స్‌ ఎంపవర్‌మెంట్‌) కర్డ్‌ (సెంటర్‌ ఫర్‌ అర్బన్‌ అండ్‌ రూరల్‌ డెవలప్‌మెంట్‌) సంస్థల ద్వారా శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. ఆ మేరకు జిల్లావ్యాప్తంగా కడపలో 4, ప్రొద్దుటూరు 4, బద్వేలు 2, జమ్మలమడుగు 2, ఎర్రగుంట్ల 2తోపాటు బ్రహ్మంగారిమఠం, చింతకొమ్మదిన్నె, కమలాపురం, ఖాజీపేట, కొండాపురం, పోరుమామిళ్ల, పులివెందుల, సింహాద్రిపురం, వేంపల్లెలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 23 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు ఒక బ్యాచ్‌, మధ్యాహ్నం 1.30 నుంచి 5.00 గంటల వరకు మరో బ్యాచ్‌గా మొత్తం 3210 మందికి శిక్షణ ఇచ్చారు. 90 రోజులపాటు శిక్షణానంతరం శిక్షణ పొందిన మహిళలకు రూ.6 వేలు విలువైన బేసిక్‌మోడల్‌ కుట్టుమిషన్‌ను ఉచితంగా అందజేయాలి. అలాగే సర్టిఫికెట్‌ను కూడా ఇవ్వాలి. శిక్షణ పూర్తయి దాదాపు మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు అందలేదు. శిక్షణ పూర్తి కాగానే ఉచితంగా కుట్టుమిషన్‌ వస్తుందని, ఈ మిషన్‌ ద్వారా స్థానికంగా మహిళా టైలరింగ్‌ షాపును నిర్వహిస్తూ ఉపాధి పొందవచ్చని పేద మహిళలు భావించారు. వారి ఆశ నిరాశే అయింది. శిక్షణ పొందిన వారికి టెండరుదారులు ఏ సమాధానం చెప్పక పోవడంతో శిక్షణ పొందిన మహిళల్లో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి.

సిబ్బందికి వేతన కష్టాలు

ఉచిత శిక్షణలో భాగంగా ఒక కేంద్రానికి ఒక టీచర్‌తోపాటు ఒక కంప్యూటర్‌ ఆపరేటర్‌ను కూడా నియమించారు. టీచర్‌ కుట్టు శిక్షణలో మెళుకువలు నేర్పడానికి, కంప్యూటర్‌ ఆపరేటర్‌ అభ్యర్థుల హాజరు తదితర వివరాలు నమోదు చేసుకునేందుకు నియమించారు. టీచర్‌కు ఒక నెలకు రూ. 15 వేలు, కంప్యూటర్‌ ఆపరేటర్‌కు రూ. 12 వేలు చొప్పున వేతనాలు మంజూరు చేయాలి. 90 రోజుల శిక్షణకుగాను నామమాత్రంగా 30 రోజులకు మాత్రమే రూ. 30 లక్షల వరకు వేతనాల కింద అందజేశారు. మిగిలిన డబ్బులు ఇంతవరకు రాకపోవడంతో వారు కూడా బకాయి వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇందులో కొంతమొత్తం బీసీ శాఖ అధికారులకు అందినట్లుగా సమాచారం.

త్వరలో కుట్టుమిషన్లు మంజూరు

బీసీకార్పొరేషన్‌ పర్యవేక్షణలో టెండర్లను దక్కించుకున్న వారు శిక్షణ కార్యక్రమాలను చేపట్టారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు త్వరలో కుట్టుమిషన్లు అందజేస్తామని టెండరుదారులు తెలిపారు. సిబ్బంది వేతనాల బిల్లులు మంజూరుకు సంబంధించి ఎలాంటి అవకతవకలు జరగలేదు.

– జయసింహ, ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌, జిల్లా బీసీ కార్పొరేషన్‌

క్లుప్తంగా

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ



విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న సిమెంట్ లారీ

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణ పరిధి అంబకపల్లె రోడ్డు సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని ఆదివారం తెల్లవారుజామున సిమెంట్ లారీ ఢీకొంది. బెంగళూరు నుంచి సిమెంట్ లారీ ఎర్రగుంట్ల వైపు వెళ్తుండగా.. అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఆ సమయంలో పరిసర ప్రాంతాల్లో ఎవరూ సంచరించకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న ట్రాఫిక్ సీఐ హాజీవలి సంఘటనా స్థలానికి చేరుకుని, విద్యుత్ స్తంభాన్ని తొలగించారు.

పెద్ద దర్గా దర్శించుకున్న వక్ఫ్‌బోర్డ్ సీఈవో



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న వక్ఫ్‌బోర్డ్ సీఈవో మహమ్మద్ అలీ

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని పెద్ద దర్గాను వక్ఫ్ బోర్డ్ సీఈవో మహమ్మద్ అలీ ఆదివారం రాత్రి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సయ్యద్ దావూద్ బాషా ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం వక్ఫ్ బోర్డ్ సీఈఓ మాట్లాడుతూ ప్రపంచంలోనే ప్రసిద్ధి గాంచిన పెద్ద దర్గాను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకుడు లయన్ పటాన్ ఖాదర్‌బాషా, దర్గా ముజావర్ అమీర్, మేనేజర్ అలీఖాన్, బీఎండబ్ల్యూ ఇదాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

టపాసుల గోడౌన్‌లలో తనిఖీలు



గోడౌన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న టపాసుల గోడౌన్‌లలో ఆదివారం రాత్రి డీఎస్పీ భావన సీఐలతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ప్రకాష్‌నగర్, ఆటోనగర్, పొట్టిపాడు రోడ్డులలో ఉన్న గోడౌన్‌లలో ఏకకాలంలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ నిర్వాహకుల లైసెన్సులను పరిశీలించారు. తనిఖీల సమయంలో లైసెన్స్ పరిమితికి మించి టపాసులను నిల్వ చేసినట్లు పోలీసు అధికారులు గుర్తించారు. అదనంగా నిల్వ ఉంచిన సుమారు 12 టన్నుల టపాసులను వారు స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత గోడౌన్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీ భావన ఆయా సీఐలకు ఆదేశాలు జారీ చేశారు. టపాసుల గోడౌన్ నిర్వాహకులు సంబంధిత అధికారులు జారీ చేసిన చెల్లుబాటయ్యే లైసెన్సులను కలిగి ఉండాలని, గడువు ముగిసిన లైసెన్సులను వెంటనే పునరుద్ధరించుకోవాలని డీఎస్పీ సూచించారు. అనధికారికంగా టపాసులు నిల్వ ఉంచరాదని, గోడౌన్‌లలో ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. గోడౌన్ లలోకి గాలి వచ్చేలా చూసుకోవాలని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మైనర్లను గోడౌన్‌లలో పని చేసేందుకు నియమించుకోరాదని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. దాడుల్లో సీఐలు నాగభూషణం, సదాశివయ్య, తిమ్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి.. నత్తగా మారి

- జాతీయ రోడ్డు నిర్మాణంలో జాప్యం
- భూ సేకరణలో రెవెన్యూ శాఖ నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వం అశ్రద్ధ



చాగలమర్రి నుంచి వేంపల్లెకు వేయాల్సిన ఎన్‌హెచ్-440 రోడ్డు ఇదే



వేంపల్లె-రాయచోటి ఎన్‌హెచ్-440 నిర్మాణ పనుల్లో భాగంగా వేసిన రోడ్డు

కడప సిటీ : జాతీయ రహదారి–440 నిర్మాణ పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో.. కల నెరవేరుతుందన్న తరుణంలో.. పనుల్లో జాప్యం జరుగుతుండటం నిరాశ కలిగిస్తోంది. భూ సేకరణ అంతంత మాత్రమే జరగడంతో నిర్మాణానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. రెవెన్యూ శాఖ భూ సేకరణకు సహకరించలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రోడ్డుకు 2023 మార్చిలో నిధులు మంజూరైనప్పటికీ ప్రధానంగా భూ సేకరణ కాకపోవడంతోనే పనులు ముందుకు సాగడం లేదు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఊపందుకున్న పనులు.. ఆ తర్వాత కుంటుపడుతూనే వస్తున్నాయి. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఈ రోడ్డు నిర్మాణ పనులకు కేంద్ర ప్రభుత్వ పెద్దలను పలుమార్లు కలిసి పట్టుదలతో కృషి చేశారు. కేంద్ర మంత్రి గడ్కరీకి అనేకమార్లు వినతి పత్రాలు సమర్పించి సమస్యను వివరించడంతో ఆయన కృషి ఫలించి రహదారి నిర్మాణానికి అడుగులు పడ్డాయి. ఈ విషయంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చేసిన కృషిని ప్రజలు అభినందిస్తున్నారు. రెండు రీచ్‌లుగా అంటే చాగలమర్రి–వేంపల్లె వరకు 80 కిలోమీటర్లకు గాను రూ.660 కోట్లు, వేంపల్లె–రాయచోటి వరకు 53.9 కిలోమీటర్లకు గాను రూ.230 కోట్ల నిధులు కేటాయించారు.

ప్రజల ఇబ్బందులు తొలగేందుకే

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఈ రోడ్డు కార్యరూపం దాల్చుతుందన్న నేపథ్యంలో.. ఆయన ఆకస్మిక మరణంతో అటకెక్కింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ పూర్తిగా ఈ రోడ్డు నిర్మాణాన్ని విస్మరించింది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచన మేరకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కృషితో ఎట్టకేలకు ఈ రోడ్డు నిర్మాణానికి అడుగులు పడ్డాయి.

రైతులకు పరిహారం అంతంత మాత్రమే

ప్రధానంగా ఈ రోడ్డు పనులు నత్తనడకన నడుస్తున్నాయి. ఇందుకు కారణం భూ సేకరణ ఆలస్యం కావడంతోనేనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూశాఖ నిర్లక్ష్యం వహించడం వల్లే ఈ పరిస్థితి నెలకొంటోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నేషనల్ హైవే కేంద్ర ప్రభుత్వానికి సంబంధించినప్పటికీ.. భూ సేకరణ మాత్రం రాష్ట్ర ప్రభుత్వం సేకరించి వారికి అప్పగించాల్సి ఉంటుంది. రెవెన్యూ శాఖ నిర్లక్ష్యం వహిస్తుందంటే.. అందుకు కారణం ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వమే. రెండు రీచ్‌లకు కలిపి మొత్తం 185 హెక్టార్లు భూ సేకరణ చేయాల్సి ఉంది. ఇందులో చాగలమర్రి–వేంపల్లె రోడ్డుకు 174 హెక్టార్లకు గాను 104 హెక్టార్లు మాత్రమే జరిగింది. అలాగే వేంపల్లె-రాయచోటి రోడ్డుకు కేవలం 11 హెక్టార్ల భూసేకరణ గాను.. దాదాపు ఇక్కడ భూసేకరణ పనులు చిన్నా చితక ప్రాంతాల్లో మాత్రమే పూర్తి చేయాల్సి ఉంది. మొత్తం భూసేకరణకు చాగలమర్రి–వేంపల్లె రోడ్డుకు రూ.300 కోట్లు చెల్లించాల్సి ఉండగా, రూ. 24 కోట్లు రైతులకు అందింది. అలాగే వేంపల్లె–రాయచోటి రోడ్డుకు రూ.70 కోట్ల పరిహారానికి గాను రూ.53 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. సంబంధిత శాఖ మంత్రి పట్టించుకుని భూసేకరణపై శ్రద్ధ వహిస్తేగానీ పనులు ముందుకు సాగవు.

ముందుకు సాగని చాగలమర్రి–వేంపల్లె ఎన్‌హెచ్ రోడ్డు పనులు

ఎన్‌హెచ్–440 పేరుతో చాగలమర్రి–వేంపల్లె వరకు 80 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఇందుకు గాను 285 హెక్టార్ల భూ సేకరణ అవసరం ఉంది. మొత్తం రూ.660 కోట్లతో ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. భూ సేకరణ తీవ్ర ఆలస్యం కావడంతో ఈ రోడ్డు పనులు ముందుకు సాగలేదు. ఇటీవలే ఈ రోడ్డుకు టెండర్లు కూడా పూర్తయ్యాయి. 28 గ్రామాల మీదుగా ఈ రోడ్డు నిర్మాణం జరగనుంది. పరిహార విషయంలో రూ.14 లక్షల నుంచి గరిష్టంగా రూ. 2.50 కోట్ల వరకు హెక్టారుకు ఉంది. చాగలమర్రి నుంచి రాజుపాళెం, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల మీదుగా వేంపల్లె–రాయచోటి బైపాస్ వరకు ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉంది. 2024 వరకు పనుల్లో పురోగతి ఉండగా, ఆ తర్వాత జాప్యం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం శ్రద్ధ వహించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. రెండు మేజర్ బ్రిడ్జిలు, ఇంకా చిన్నా చితక వంతెనలు కూడా నిర్మించాల్సి ఉంది. త్వరలో రోడ్డు నిర్మాణం చేపట్టి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న వేంపల్లె–రాయచోటి ఎన్‌హెచ్ రోడ్డు పనులు

వేంపల్లె–రాయచోటి ఎన్‌హెచ్–440 రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. 53.9 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించాల్సి ఉండగా, రూ.230 కోట్ల నిధులు కేటాయించారు. ఇప్పటి వరకు 40 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంలో మేజర్ వంతెనలు 2, మైనర్ వంతెనలు 11, కల్వర్టులు 60, పైపు కల్వర్టులు మరికొన్ని అవసరం ఉన్నాయి. ఎస్‌ఆర్‌కే కన్‌స్ట్రక్షన్ ఈ పనులను ప్రారంభించింది. మరో ఆరు నెలలు గడిస్తే గానీ ఈ రోడ్డు పూర్తయ్యే అవకాశం లేదు. చక్రాయపేట వద్ద గ్రామంలో కాకుండా ఊరి వెలుపల రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. అయితే అందుకు సంబంధించిన సర్వీసు రోడ్డు గుంతలమయంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులకు విన్నవిస్తున్నారు. భూ సేకరణకు కేవలం 11 ఎకరాలు మాత్రమే అవసరం ఉండగా, రూ.70 కోట్లకు గాను రూ.53 కోట్ల పరిహారం అందించారు. మరికొంత భూ సేకరణ చేయాల్సి ఉంది. ఎల్ ఆర్ పల్లె, నాగులగుట్టపల్లె, అంజనేయపురం, పాయలోపల్లె గ్రామాల వద్ద భూ సేకరణ పెండింగ్‌లో ఉంది. ఈ భూ సేకరణ పూర్తయితే ఎటువంటి ఆటంకం లేకుండా రోడ్డు పనులు కొనసాగే అవకాశం ఉంది.

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కృషి ఎనలేనిది

ఈ రోడ్ల నిర్మాణానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఎంతో కృషి చేశారు. పలుమార్లు సంబంధిత కేంద్ర మంత్రి గడ్కరీకి వినతిపత్రాలు సమర్పిస్తూ సమస్యను వివరిస్తూ రావడంతో ఎట్టకేలకు ఆయన కృషి ఫలించి ఈ రోడ్డు నిర్మాణానికి అడుగులు పడ్డాయి. కడప ఎంపీ కృషి ఫలితం వల్లే నిధులు మంజూరు కావడం జరిగింది. ఆయన చేసిన కృషిని ప్రజలు అభినందిస్తున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



ఎన్‌హెచ్–440 రోడ్డు నిర్మాణ పనులను త్వరగా చేపట్టి పూర్తి చేయాలి. ఎన్నో ఏళ్లుగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాల్సి అవసరం ఉంది. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా రోడ్డు పనులు కొనసాగించాలి.

– ఎన్.శివ, యాండ్లవాండ్లపల్లె, చక్రాయపేట మండలం

దుమ్ము, ధూళితో అల్లాడుతున్నాం



వేంపల్లె–రాయచోటి నేషనల్ హైవే పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధానంగా చక్రాయపేట మండల కేంద్రంలో తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. ఈ రోడ్డుకు సంబంధించిన వాహనాలు తిరగడం వల్ల రోడ్డు గుంతలమయంగా మారింది. దుమ్ము, ధూళితో అల్లాడిపోతూ రోగాల బారిన పడుతున్నాం. ఎన్‌హెచ్ అధికారులు చొరవ తీసుకుని రోడ్డు వేయాలి.

– బి.యోగేశ్వర, నాగిరెడ్డిపల్లె, చక్రాయపేట మండలం

త్వరితగతిన పూర్తికి చర్యలు

ఎన్‌హెచ్–440 రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. భూ సేకరణ ఆలస్యం కావడం వల్ల పనులకు ఇబ్బంది కలుగుతోంది. సంబంధిత అధికారులతో భూ సేకరణ విషయంపై చర్చించి వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్.సుధాకర్, ఎన్‌హెచ్ ఈఈ, కడప

కూటమి ప్రభుత్వంలో ఆటో రంగం కుదేలు

- ఉచిత బస్సుతో రోడ్డున పడ్డ ఆటో కార్మికులు
- వైఎస్సార్ టీయూసీ నేతలు



మాట్లాడుతున్న వైఎస్సార్ టీయూసీ నాయకులు

కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వంలో ఆటో రంగం కుదేలైందని వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు జాషువా, రాష్ట్ర అధికార ప్రతినిధి సుదర్శన్ రాయల్, నగర అధ్యక్షుడు నాగరాజు అన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో 13 లక్షల మంది ఆటో కార్మికులు ఉన్నారని చెప్పిన మంత్రి లోకేష్.. ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని రెండు లక్షల 90 వేల మందికి మాత్రమే వర్తింప చేశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆటో కార్మికులకు మరమ్మతులు, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం ఇలాంటి నిబంధనలు లేకుండా పది వేల రూపాయలు ఇవ్వడం జరిగిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. గిరాకీలు లేక ఆటోల ఈఎంఐలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీని నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఆటో కార్మికులకు రూ.15000 ఇస్తామని చెప్పిన ప్రభుత్వం అనేక షరతులు విధించిందన్నారు. ఇన్సూరెన్స్, ఎఫ్‌సీ బ్యాడ్జి నంబరు, ఇన్‌కమ్, క్యాస్ట్ వంటి సర్టిఫికెట్లు ఉంటేనే దరఖాస్తు చేసుకునేందుకు అనుమతించారన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు సమయం కూడా మూడు రోజులే ఇచ్చారన్నారు. దీనివల్ల చాలామంది దరఖాస్తు చేసుకోలేకపోయారని తెలిపారు. వేలాది మంది ఆటో కార్మికులకు ఈ పథకం వర్తించకుండా కోత కోశారని, ఆటో స్టాండ్‌లో ఆటో కార్మికులను బెదిరించి సమావేశాలకు రప్పించుకున్నారన్నారు. ఇచ్చింది కొద్ది మందికి అయినా టీడీపీ నాయకులు ఖాకీ చొక్కాలు వేసుకుని ఆటోలు తోలుతూ ఫొటోలకు ఫోజులు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మియా, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధికార ప్రతినిధి ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి సమస్య పరిష్కరించలేదని వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న సత్యనారాయణ

పోరుమామిళ్ల : ఏళ్లు గడుస్తున్నా తన ఇంటి సమస్య పరిష్కరించలేదని ఓ వ్యక్తి ఆదివారం ఆత్మహత్యకు ప్రయత్నించాడు. వివరాలిలా ఉన్నాయి. ఆరేళ్ల క్రితం అమ్మవారిశాల పురాతన మందిరం తొలగించి నూతనంగా నిర్మించే సమయంలో.. ఆనుకుని ఉన్న దర్శి సత్యనారాయణ ఇల్లు దెబ్బతింది. అప్పట్లో ఆలయ కమిటీవారు ఈ ఇంటిని మళ్లీ యథాతథంగా చేస్తామన్నారు. తరువాత వివిధ కారణాలతో ఆ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. సత్యనారాయణ ఇల్లు బాగు కోసం ఎంత ఖర్చు చేసినా ఇస్తామని కమిటీవారు చెబితే, మీరే బాగు చేయాలని ఆయన అన్నాడని, తాము చేస్తామంటే అలా కాదు, ఇలా కాదు, అంటూ ఏవేవో సాకులు చెపుతూ సత్యనారాయణ సమస్య పరిష్కారానికి అవకాశం ఇవ్వడం లేదని ఆలయ సభ్యుల మాట. తన ఇంటిని ఇంత వరకు బాగు చేయించలేదని సత్యనారాయణ వాదన. ఇలా ఇరువురి మధ్య సమస్య తెగక నలుగుతూ ఉంది. ఆదివారం అమ్మవారిశాలలో మరో పంచాయతీపై పట్టణ ఆర్యవైశ్యులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమయంలో తన సమస్యకు పరిష్కారం చూపాలని దర్శి సత్యనారాయణ పట్టుబట్టారు. ఆ సమస్యపై సభ్యులు మాట్లాడటం లేదని ఆవేశంతో సత్యనారాయణ ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. అందరి ముందు ఆత్మహత్యకు సిద్ధపడ్డాడు. వెంటనే అక్కడున్నవారు అడ్డుకుని ఆసుపత్రికి తరలించారు. పెట్రోలు పోసుకోవడం వల్ల సత్యనారాయణ స్పృహ తప్పాడు. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

చౌక బియ్యం పట్టివేత

సిద్దవటం : మండల పరిధి మాధవరం–1 గ్రామ పంచాయతీ మహబూబ్‌నగర్ గ్రామంలోని ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన 20 బస్తాల చౌక దుకాణం బియ్యాన్ని ఆదివారం పట్టుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచారని వచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ, పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. 681 కేజీల బియ్యం స్వాధీనం చేసుకుని, సిద్దవటం ఆకులవీధికి చెందిన అతికారి మురళి, కడపకు చెందిన వ్యక్తిని అరెస్టు చేశారు.

ఆడుకుంటూ.. అనంతలోకాలకు..



మోక్షిత్



లిఖిత్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి సుజన

సంబేపల్లె : ఇద్దరు చిన్నారులు ఆడుకుంటూ.. అనంతలోకాలకు వెళ్లారు. నీటి కుంటలో పడి మృత్యువాత పడ్డారు. వారి తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ సంఘటన సంబేపల్లె మండల పరిధిలోని రెడ్డివారిపల్లె గ్రామం నడిమిరాజుగారిపల్లె దళితవాడ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నడిమిరాజుగారిపల్లెకు చెందిన ములగురి జనార్దన్‌నాయుడు, సుజన దంపతులకు లిఖిత్ (11) అనే కుమారుడు ఉన్నాడు. వారి ఇంటికి మదనపల్లె అమ్మమిట్ట చెరువుకు చెందిన రఘుపతి నాయుడు, సుమలతతోపాటు వారి కుమారుడు పి.మోక్షిత్(13) దసరా సెలవుల సందర్భంగా వచ్చారు. సుమలత, సుజన అక్కాచెల్లెళ్లు. వారి కుమారులైన లిఖిత్, మోక్షిత్ సెలవుల్లో సరదాగా గడిపారు. ఈ క్రమంలో ఆడుకుంటూ సమీపంలోని నల్లరాళ్లకుంట వద్దకు వెళ్లారు. అక్కడ ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందారు. స్థానికుల సహాయంతో మృతదేహాలను వెలికి తీశారు. వారి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి పరిశీలించి, బాధిత కుటుంబాలను పరామర్శించారు.

సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకం



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ, అపుస్మా నాయకులు

కడప ఎడ్యుకేషన్ : సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకమని పశ్చిమ రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. కడపలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వైఎస్సార్ కడప జిల్లా అపుస్మా ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న 110 మంది టీచర్స్‌కు ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయులపైన చిన్న చూపు తగదని, వారిని కూడా ఆదరించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అపుస్మా (ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజిమెంట్ అసోసియేషన్) ఆధ్వర్యంలో బెస్ట్ టీచర్స్‌కు ఏటా అవార్డులను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బ్రహ్మంగారిమఠం స్వామీజీ శ్రీ విరిజానంద మాట్లాడారు. తరువాత అపుస్మా జిల్లా అధ్యక్షులు గంగయ్య అధ్యక్షతన అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో అపుస్మా చీఫ్ అడ్వైజర్ పుల్లయ్య, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వి. రమణారెడ్డి, క్రమశిక్షణ సంఘం కమిటీ చైర్మన్ పోతిరెడ్డి, రాష్ట్ర సీనియర్ జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఎలియాస్‌రెడ్డి, జోనల్ ప్రెసిడెంట్ సుబ్బారావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బయ్య, జిల్లా జనరల్ సెక్రటరీ శివశంకర్‌రెడ్డి, ట్రెజరర్ నాగసుబ్బారెడ్డి నగర అధ్యక్షురాలు మైథిలి, ప్రధాన కార్యదర్శి పద్మారెడ్డి, అపుస్మా వివిధ జిల్లాల రాష్ట్ర, జిల్లా, కడప నగర అపుస్మా నాయకులు, కరస్పాండెంట్స్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతి చెందిన ప్రతాప్‌రెడ్డి

వేంపల్లె : చక్రాయపేట మండలంలోని గొంది అడవుల్లో నక్కలదిన్నెపల్లె గ్రామ వాసి బండ్లపల్లె ప్రతాప్ రెడ్డి (55) అనే వ్యక్తి ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చక్రాయపేట మండలంలోని నక్కలదిన్నెపల్లె గ్రామానికి చెందిన బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి, గడ్డంవారిపల్లె గ్రామానికి చెందిన యోగేశ్వరరెడ్డి కలిసి శనివారం గొంది గ్రామ సమీపంలోని తెల్లకొండ అడవి ప్రాంతానికి మంచం కోళ్లకు సంబంధించి కొయ్యలు తీసుకొచ్చేందుకు వెళ్లారు. అయితే గొంది అడవి ప్రాంతంలోని తెల్లకొండ సమీపంలో ప్రతాప్‌రెడ్డికి తేనెటీగలు కుట్టి అక్కడికక్కడే మృతి చెందాడని యోగీశ్వరరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడి కుమారుడు నవీన్‌కుమార్‌రెడ్డి, బంధువులతో కలిసి పోలీసులు గొంది సమీపంలోని అడవి ప్రాంతానికి వెళ్లి ప్రతాప్‌రెడ్డి మృతదేహన్ని పరిశీలించారు. మృతదేహన్ని వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా.. మృతి జరిగిన సంఘటనపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేయడంతో కడప రిమ్స్‌కు తరలించారు. కడప రిమ్స్‌లో ప్రతాప్‌రెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం చేసి బంధువులకు పోలీసులు అప్పగించారు. నవీన్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. అయితే వీరిరువురూ తెల్ల కొండ అటవీ ప్రాంతంలో గుప్త నిధుల కోసం వెళ్లారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రతాప్‌రెడ్డి వెంట వెళ్లిన యోగేశ్వరరెడ్డిని పోలీసులు విచారణ చేస్తే పూర్తి వివరాలు బయటపడతాయని వారు అంటున్నారు.

'రెవెన్యూ' మాయాజాలం

- ఒకరి భూమి మరొకరిపై ఆన్‌లైన్
- హక్కుదారుడు నిలదీయడంతో.. మళ్లీ అతని పేరుపై..
- పాసుపుస్తకం మంజూరులో జాప్యం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం



గోపవరం తహసీల్దారు కార్యాలయం

గోపవరం : చేయి తడిపితే ఎలాంటి పనినైనా చేయగల సత్తా ఒక రెవెన్యూ శాఖలోనే ఉంది. దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ ఆ శాఖ అధికారుల తీరులో.. ఎలాంటి మార్పులేదు. ఫలితంగా భూ వివాదాలు పేట్రేగిపోతున్నాయి. ఏ శాఖలోనైనా కొంత మేరకైనా సమస్యలు పరిష్కారమవుతాయి గానీ రెవెన్యూశాఖలో మాత్రం రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. ఈ విషయం సాక్షాత్తు స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే కలెక్టర్ల సమావేశంలో చెప్పిన సంగతి తెలిసిందే. ఇందుకు నిదర్శనం సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్న తీరే. పైసలిస్తే పట్టా భూమిని కూడా మార్చివేస్తున్న రెవెన్యూ అధికారులు.. గతంలో కోట్లు విలువ పలికే డీకేటీలు సైతం ఆన్‌లైన్ చేసిన దాఖలాలు ఉన్నాయి. ఇప్పుడు ఏకంగా ఓ లబ్ధిదారుడి పట్టా భూమిని కూడా నకిలీ అగ్రిమెంటుతో మరొకరి పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. గోపవరం రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 107/1ఎలో మండల జయరామయ్యకు ఒక ఎకరం పట్టా భూమి ఉంది. ఈ భూమిని ఒంగోలు వెంకటరెడ్డి దగ్గర 27–05–2002లో కొనుగోలు చేశారు. బద్వేలు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో అప్పట్లో రిజిస్టర్ కూడా అయింది. డాక్యుమెంట్ నంబర్ 557/2002.

హక్కుదారుడు ఊరిలో లేనిది చూసి..

జయరామయ్య వృత్తి రీత్యా మరొక చోట నివాసం ఉంటున్నాడు. సదరు పట్టా భూమిని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన వెంకటసుబ్బమ్మ అనే మహిళ జయరామయ్య తనకు అగ్రిమెంటు రాయించినట్లుగా ఒక అగ్రిమెంటును సృష్టించింది. సదరు మహిళకు ఆన్‌లైన్ కావాలంటే రిజిస్టర్ డాకుమెంట్ తప్పనిసరి. ఎలాగైనా అగ్రిమెంటు మీద ఆన్‌లైన్ చేయించుకోవాలనే ఉద్దేశంతో ఎంత ఖర్చు అయినా భరిస్తామని చెప్పడంతో స్థానిక రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ చేసేందుకు సిద్ధపడ్డారు. ఇక పైసలిస్తే రెవెన్యూలో ఎలాంటి పనైనా జరుగుతుందనే విషయం తెలిసిందే. ఒక రేటు మాట్లాడుకుని సదరు మహిళ వద్ద ఒప్పందం కుదుర్చుకున్నారు. వెంటనే అగ్రిమెంటు మీదనే తహసీల్దారు.. వెంకటసుబ్బమ్మ పేరుతో ఆన్‌లైన్ చేశారు. ఇదే అదునుగా భావించిన వెంకటసుబ్బమ్మ ఇది మరొకరికి మారితే బలం చేకూరుతుందనే విషయం గ్రహించి.. తన కుమార్తె కలవకూరి ప్రశాంతికి గిఫ్ట్ రూపంలో 2024 జనవరి1న రిజిస్టర్ చేయించింది. డాక్యుమెంట్ నంబర్ 452/2024. ఇంతటితో తన వ్యూహం ముగిసిందనే లోపే అసలు లబ్ధిదారుడు జయరామయ్య తన భూమికి సంబంధించి ఆన్‌లైన్‌లో చెక్ చేసుకోవడం జరిగింది. ఆన్‌లైన్‌లో తన పేరుకు బదులు వెంకటసుబ్బమ్మ పేరు ఉండటంతో కంగుతిన్నాడు. ఒకరి పేరుతో ఉన్న పట్టా భూమి కూడా మరొకరి పేరుతో మారుతుందా అని సందేహపడ్డారు. హుటాహుటిన గోపవరం తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని తహసీల్దారును నిలదీశారు. అక్కడ సరైన సమాధారం రాకపోవడంతో 2024 డిసెంబర్16న బద్వేలు ఆర్డీఓకు అర్జీ ఇవ్వడం జరిగింది. అర్జీ పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారుల నుంచి తహసీల్దారుపై ఒత్తిడి పెరిగింది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లుగా తహసీల్దారు రంగంలోకి దిగి.. ఫేక్ అగ్రిమెంటుపై రిజిస్టర్ చేయించుకున్న వారిని సంప్రదించి రిజిస్టేషన్‌ను రద్దు చేయించుకోవాలని ఒత్తిడి తీసుకువచ్చారు. వారు పలకకపోవడంతో రెవెన్యూ అధికారులే 2025 జనవరి 2వ తేదీన బద్వేలు సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి వెళ్లి.. 2024 నవంబర్ 22న ప్రశాంతి పేరు మీద జరిగిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని సబ్ రిజిస్ట్రారును కోరారు. అందుకు అయ్యే ఖర్చును తామే భరిస్తామని చెప్పడంతో ఎట్టకేలకు రిజిస్టర్‌ను రద్దు చేశారు. రద్దు చేసిన డాక్యుమెంట్ నంబర్ 15/2025.

తిరిగి లబ్ధిదారుడి పేరు మీదికి మార్చికి..

ప్రశాంతి రిజిస్ట్రేషన్ రద్దు అయిన వెంటనే, వెంకటసుబ్బమ్మ పేరుతో ఉన్న ఆన్‌లైన్‌ను తిరిగి.. జయరామయ్య పేరు మీద మార్చారు. 2025 మార్చి7న జయరామయ్య పేరుతోనే పట్టా భూమి ఉందని స్వయంగా తహసీల్దారే ఎండార్స్‌మెంట్ ఇవ్వడం జరిగింది. ఈలోపే జయరామయ్య ఆరోగ్య పరిస్థితి బాగ లేకపోవడంతో 2025 ఫిబ్రవరి10న తన భార్య దొరసానమ్మ పేరుతో రిజిస్టర్ చేయించారు. రిజిస్టర్ డాక్యుమెంట్ నంబర్ 469/2025. రిజిస్టర్ కార్యాలయంలోనే దొరసానమ్మ పేరుతో ఆటోమ్యుటేషన్ అయింది. తన పేరు మీద పాసుపుస్తకం కావాలని డాక్యుమెంట్లతో పాటు మూడు దఫాలుగా మీసేవ చలానా కట్టడం జరిగింది. కానీ తహసీల్దారు మాత్రం ఇప్పటి వరకు పాసుపుస్తకాలు మంజూరు చేయలేదని స్థానిక రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అగ్రిమెంటు మీద ఆన్‌లైన్ చేసిన తహసీల్దారు స్వయంగా పట్టాదారుని పేరుకే పాసుపుస్తకాలు మంజూరు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారంటే ఆయన వ్యవహారశైలి ఏవిధంగా ఉందోనని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాను మీసేవలో మూడు దఫాలు చలానా కట్టినా పాసుపుస్తకాలు మంజూరు కాకపోవడంతో.. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని లబ్ధిదారురాలు చెప్పిడం జరిగింది. జరిగిన పూర్తి సమాచారంపై తహసీల్దారు త్రిభువన్‌రెడ్డిని సాక్షి వివరణ కోరగా అగ్రిమెంట్ మీద ఆన్‌లైన్ చేయడం జరిగిందని, తిరిగి జరిగిన తప్పిదాన్ని సరిచేసినట్లు తెలిపారు.